సాక్షి ఖమ్మం
శుక్రవారం ; 13 ; డిసెంబర్ ; 2024



చిన్నారులు భద్రమేనా?

ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో రక్షణ ఏర్పాట్లు అంతంతే కావడంతో చిన్నారుల రక్షణపై ఆందోళన వ్యక్తం అవుతోంది. 8లో



ప్రపంచాన్ని మార్చే శక్తి ..

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానికి మాత్రమే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
29° / 16°

జిల్లాలో శుక్రవారం రోజంతా చల్లగా ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి పూట చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రూప్‌-2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఖమ్మంక్రైం : ఈనెల 15, 16 తేదీల్లో టీజీపీఎస్సీ గ్రూప్‌–2 పరీక్షలు జరుగుతుండగా, ఖమ్మం కమిషనరేట్ పరిధిలో అన్ని కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం అమల్లో ఉంటుందని సీపీ సునీల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనుండగా 15వ తేదీ ఉదయం 6 నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్‌లు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలకు అవకాశం లేదని వివరించారు. పరీక్ష సమయంలో సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలను సందర్శించిన జెడ్పీ సీఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఈఓ

రఘునాథపాలెం : మండలంలోని కోయచలక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జెడ్పీ సీఈఓ దీక్షారైనా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై శాస్త్రీయ అధ్యయనం

- ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తాం
- రాష్ట్ర ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా హాజరైన కుల సంఘాల నేతలు
- తల్లంపాడులో క్షేత్రస్థాయి పర్యటన



కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు వింటున్న ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

ఖమ్మంమయూరిసెంటర్: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కోసం స్వీకరించిన దరఖాస్తులపై శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేస్తామని, అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సీ కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో గురువారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ కులాల సంఘాల నాయకులు, వ్యక్తులు దరఖాస్తులు అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందిస్తామని చెప్పారు. ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇప్పటికే రంగారెడ్డి, నల్లగొండ తదితర జిల్లాల్లో బహిరంగ విచారణ నిర్వహించామని తెలిపారు. జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని వివరించారు. ఉప వర్గీకరణపై నిర్వహించిన బహిరంగ విచారణలో 450 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారని పేర్కొన్నారు. అంతకుముందు కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు ఎన్నెస్పీ అతిథిగృహం వద్ద కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ, భద్రాద్రి జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు నవీన్ బాబు, ఉపేందర్‌రావు, రాష్ట్ర కార్యాలయ సూపరింటెండెంట్ సజ్జన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తల్లంపాడు ఎస్సీ కాలనీలో విచారణ చేస్తున్న షమీమ్ అక్తర్

తల్లంపాడులో పర్యటన

ఖమ్మంరూరల్ : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ మండలంలోని తల్లంపాడు ఎస్సీ కాలనీలో గురువారం విచారణ నిర్వహించారు. కాలనీ వాసుల కుటుంబ వివరాలు, ఎంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు, భూములు ఉన్నాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం కలుగుతుందని తెలిపారు. ఉపాధికి చేపడుతున్న పనులు, ప్రభుత్వం నుంచి పొందుతున్న సాయంపై ఆరా తీశారు. కాలనీ వాసులు చెప్పిన ప్రతీ విషయాన్ని శ్రద్ధగా విని నమోదు చేసుకున్నారు. కమిషన్ చైర్మన్ వెంట తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆక్రమిత స్థలాలను గుర్తించండి

- ఎన్నెస్పీ స్థలాల రికార్డును కలెక్టర్‌కు అందించాలి
- సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం నగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, ఎన్నెస్పీ, వక్ఫ్‌బోర్డు స్థలాలను గుర్తించాలని, 58, 59 జీఓల ఆధారంగా అనర్హులకు స్థలాలు రెగ్యులరైజ్ చేసి పట్టాలిస్తే వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణ జరిగే ప్రాంతాల్లో, నాలాలు వెళ్లే చోట స్థలాలను రెగ్యులరైజ్ చేస్తే వారికి మరో చోట అందించి న్యాయం చేయాలన్నారు. వీటిని సవరిస్తేనే భవిష్యత్‌లో నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలన్నారు. అధికారులు నిద్ర పోతుంటే అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టకుండా ఎలా ఉంటారని అసహనం వ్యక్తం చేశారు. నగరంలో టౌన్ ప్లానింగ్ పని తీరు సరిగా లేదని, మార్చుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు అమలుచేయాలన్నారు. షాపింగ్‌మాళ్లు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల వద్ద రోడ్లు బ్లాక్ చేస్తే ప్రజలు ఎలా వెళ్తారని అధికారులను ప్రశ్నించారు. వైన్స్ షాపుల వద్ద వాహనాలను రోడ్ల మీదే పార్క్ చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉండాలని, వాటిని సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీల్లో కార్మికుల కొరత, తాగునీటి సమస్యలు, ఫాగింగ్ యంత్రాలు, పనిముట్లు లేవంటూ ఫిర్యాదులొస్తున్నాయని, ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అన్నారు. వచ్చే వర్షాకాలానికి ముందే రాజమండ్రి రహదారి పూర్తి కావాలని ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. ప్రతీ వాహనాన్ని జీపీఎస్ ట్రాకర్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నామని చెప్పారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతి డివిజన్‌కు పారిశుద్ధ్య ప్రణాళిక తయారు చేశామని, వాటర్‌మెన్, లైన్‌మెన్, పారిశుద్ధ్య సిబ్బంది వివరాలు అందరికీ తెలిసేలా గోడలపై రాశామని, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభిస్తామని వెల్లడించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిత్యం 15 – 20 ఆపరేషన్లు చేస్తున్నామని, కోతులు, పందుల సమస్య పరిష్కారానికి ప్రైవేట్ ఏజెన్సీలతో సంప్రదిస్తున్నామని వివరించారు. సమావేశంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

ఖమ్మం సహకారనగర్ : సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్సీ, యూఆర్ఎస్, కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమ్మె చేస్తున్నందున విద్యార్థినులకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మహాసభలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తదితరులు హాజరవుతారని వివరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గా భవాని కోరారు. గురువారం నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి - ఉపాధ్యాయుల కర్తవ్యాలు అనే అంశంపై ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు - ఉద్యమాలు అనే అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు బుర్రి.వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, బి. రాందాస్, ఎ. సుధాకర్, వి.వి. రామారావు, పి.సురేష్, కె. గీత, డి.నాగేశ్వరరావు, ఎం.నరసయ్య, షేక్ నాగుర్ వలి, ఉద్దండు షరీఫ్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పటిష్టం చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి గురువారం ఆయన మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అబార్షన్లు జరగకుండా తనిఖీలు చేయాలని సూచించారు. ఆడ పిల్లల రక్షణ (సేవ్ ది గర్ల్ చైల్డ్)కు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో టీచర్స్, పేరెంట్ సమావేశాల్లోనూ దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలను ఉదాహరణగా చూపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి అబార్షన్ జరిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో కాకుండా పక్క జిల్లాల నుంచి ఆర్ఎంపీలు వచ్చి ఇక్కడ అబార్షన్ చేయిస్తున్నారని, వారికి డాక్టర్లు సహకరించి తగిన కమీషన్లు ఇస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వి.చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ లీగల్ సర్వీస్ సెల్ ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి కళావతి బాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీఓ విష్ణువందన, ఐఎంఏ అధ్యక్షుడు నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నయా బజార్ జూనియర్ కళాశాలలో రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు విద్యా సంస్థ వారు రూ. 3,87,600తో చేపట్టిన పలు కార్యక్రమాలను రోటరీ క్లబ్ గవర్నర్ కె.శరత్ చౌదరితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లాది వాసుదేవ్, పి.సాంబశివరావు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, డీఐఈఓ రవిబాబు, ప్రిన్సిపాల్ కెఎస్ రామారావు పాల్గొన్నారు.

వసతిగృహంలో మెరుగైన సౌకర్యాలు

ఖమ్మంమయూరిసెంటర్ : వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్టల్‌లో చేపట్టాల్సిన పనులపై నివేదిక ఇవ్వాలని వార్డెన్ సైదులుకు సూచించారు. పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత లేకుంటే సహించేది లేదన్నారు. విద్యార్థులకు బంకర్ బెడ్స్ అందించేందుకు టెండర్లు పిలవాలని సూచించారు.

నమూనా గృహాలు ఆదర్శంగా ఉండాలి

కూసుమంచి : మండల కేంద్రాల్లో నిర్మించే ఇందిరమ్మ గృహాల నమూనా నిర్మాణాలు ఆదర్శంగా, ఆకర్షణీయంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసే నమూనా గృహ నిర్మాణానికి శుక్రవారం రెవెన్యూ, గృహనిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనుండగా గురువారం కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నర్సింహారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, హౌసింగ్, పీఆర్ ఈఈలు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పులి కలకలం

- జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల గాలింపు
- గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం ప్రాంతాల్లో జాడలను వెదుకుతున్న సిబ్బంది
- ములుగు జిల్లా నుంచి ఇటు వచ్చినట్లు చెబుతున్న తాడ్వాయి అధికారులు
- మూడేళ్లుగా ఏజెన్సీ గ్రామాల ప్రజలను వణికిస్తున్న జాతీయ జంతువు



గుండాల: పులి అడుగుజాడల కోసం గాలింపు చేపట్టిన అటవీశాఖ అధికారులు



ఇల్లెందు రూరల్: ఇల్లెందు-పాకాల కొత్తగూడెం ఏజెన్సీలో ఉన్న పాండవుల గుట్ట



ఇల్లెందురూరల్/చుంచుపల్లి: ఆదిలాబాద్ జిల్లాలో కొంత కాలం హడలెత్తించిన పెద్దపులి క్రమంగా కరీంనగర్, వరంగల్, ములుగు జిల్లాలు దాటుకుంటూ భద్రాద్రికొత్తగూడెం జిల్లాకి ప్రవేశించింది. పాదముద్రల ఆధారంగా పులి భద్రాద్రి జిల్లాలోకి వచ్చినట్లు ములుగు జిల్లా తాడ్వాయి అటవీశాఖ అధికారులు తెలిపినట్లు ఇక్కడి అధికారులు చెబుతున్నారు. గురువారం కరకగూడెం మీదుగా గుండాల వైపునకు పెద్దపులి ప్రయాణం సాగినట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో జిల్లాలోని అడవికి ఆనుకుని ఉన్న ఏజెన్సీ మండలాల్లో అటవీశాఖ అప్రమత్తమైంది.

మేటింగ్ సీజన్ కావడంతో..

సాధారణంగా చలికాలం అంటే నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పులులకు మేటింగ్ (సంభోగం) సీజన్. ఈ సమయంలోనే మగ పెద్దపులి ఆడతోడు కోసం వెదుకుతుంది. దశాబ్దాల క్రితం పులులకు ఆవాసాలుగా ఉన్న ప్రాంతాల్లో కలియతిరిగే అలవాటు ఉంటుంది. ఈ క్రమంలో గోదావరి పరీవాహక ప్రాంతం వెంట అక్టోబర్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించిన పులి తాజాగా జిల్లాలోకి ప్రవేశించింది.

నాలుగేళ్ల క్రితం కూడా ఆడ పులి కోసమే..

నాలుగేళ్ల క్రితం జిల్లాలో పెద్దపులి సంచారం కనిపించింది. 2020 నవంబర్‌లో మగపెద్దపులి ఆడతోడు కోసం ములుగు జిల్లా నుంచి కరకగూడెం, ఆళ్లపల్లి, మామకన్ను అటవీ ప్రాంతాలలో సంచరించింది. అక్కడి నుంచి ఇల్లెందు మండలంలో పాండవుల గుట్ట మీదుగా మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించి తిరిగి ఆదిలాబాద్ దిశగా తన ప్రయాణం కొనసాగించింది. ఆ సమయంలో జిల్లాలో ఎక్కడా మనుషులపై దాడి చేసిన ఘటన లేకపోవడంతో మ్యాన్‌ఈటర్ కాదని, ఆడతోడు కోసమే ఇటుగా వచ్చినట్లు అటవీశాఖ అధికారులు అప్పట్లో పేర్కొన్నారు. ఆ తర్వాత 2022లో మరోసారి పెద్దపులి సంచారం తిరిగి చలికాలంలోనే సాగింది.

పూర్వం పులులకు అడ్డాగా..

పూర్వం భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, గుండాల, పాండవుల గుట్ట, పూర్వ వరంగల్ జిల్లా పాఖాల కొత్తగూడెం అటవీ ప్రాంతం పెద్దపులుల సంచారానికి అడ్డాగా ఉండేది. 2000 సంవత్సరం లోనూ ఈ ప్రాంతం దట్టమైన అడవులతో అల్లుకుపోయి ఉండేది. పులుల నివాసానికి అనుగుణంగా కనిపించే గుహలు పాండవుల గుట్ట ఏడు బావుల ప్రదేశాల్లో నేటికీ దర్శనమిస్తాయి. ఆ సముదాయాన్ని పులి గుహగా పిలుస్తుంటారు. 2000 సంవత్సరంలో నవంబర్‌లోనే ఈ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు ప్రచారంలో ఉంది. బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతుకు చెందిన రెండు ఆవులను పెద్దపులి సంహరించింది. గ్రామ సమీపం వరకు దట్టమైన అడవి ఉండటంతో పులి సంచారాన్ని నాడు గిరిజనులు పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత పులుల ఆవాసంగా గుర్తింపు పొందిన పాండవుల గుట్ట అటవీ ప్రాంతంలో రెండు దశాబ్దాల తరువాత అంటే 2020లో, ఆ తర్వాత 2022లో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం మరో రెండేళ్ల తర్వాత తాజాగా మరోసారి పెద్దపులి జిల్లాలోకి ప్రవేశించి పాండవుల గుట్టకు చేరుకునే దిశగా తన ప్రయాణం సాగిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అనుమానించి అప్రమత్తమయ్యారు.

అప్రమత్తమైన అధికారులు

పెద్దపులి సంచారం జిల్లాలోకి ప్రవేశించడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అడవిని ఆనుకొని ఉన్న ములుగు జిల్లా సరిహద్దు గుండాల, ఆళ్లపల్లి మండలాలకు పెద్దపులి చేరుకుందన్న ప్రచారం జరగడంతో జాడ కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇల్లెందు మండలం కొమరారం అటవీరేంజ్ పరిధిలో కూడా గాలింపు చేపట్టారు. ఆళ్లపల్లి మండలంతోపాటు అడవికి సరిహద్దున ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో పాదముద్రలను పరిశీలిస్తున్నారు. పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ములుగు జిల్లాకు సరిహద్దున ఉన్న అటవీ ప్రాంతంలో గాలింపు, పాదముద్రల పరిశీలన చేపడుతున్నట్లు కొమరారం రేంజ్ అధికారి ఉదయ్ తెలిపారు. పాండవుల గుట్ట, ఏడు బావుల ప్రాంతంలో నిఘా పెంచామని వివరించారు.

కిన్నెరసాని అభయారణ్యంలోకి ప్రవేశించిందా..?

గుండాల: మూడు, నాలుగేళ్లుగా జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చలికాలంలో జాతీయ జంతువు అడుగుజాడలు కనిపిస్తుండగా, ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు కంటిమీద కునుకు ఉండటంలేదు. మళ్లీ పులి వచ్చిందని అటవీశాఖ అధికారులు చెబుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో పులి వచ్చినట్లు ప్రచారం సాగుతుండటంతో ప్రజలు వణికి పోతున్నారు. మూడు రోజుల పాటు ములుగు జిల్లాలో సంచరించిన పులి మంగపేట, మల్లూరు అటవీ ప్రాంతాల నుంచి సరిహద్దు దాటి జిల్లాలోకి అడుగుపెట్టిందనే సమాచారం అటవీశాఖ అధికారులకు అందింది. దీంతో గుండాల, ఆళ్లపలి, రేగళ్ల, కాచనపల్లి ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గురువారం తెల్లవారు జామున మల్లూరు గుట్టవైపు వెళ్లిందని పేర్కొంటున్నారు. దామరతోగు, రేగళ్ల, మర్కోడు, అడవిరామారం, కొమరారం అటవీ ప్రాంతాల్లోని నీటి కొలను, దారి మార్గాల్లో పులి అడుగుజాడలను గుర్తించే పనిలో ఉన్నారు. అడవుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. పశువుల కాపరులు అడవులకు వెళ్లొద్దని, వ్యవసాయ పనులకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. తాడ్వాయి అడవి దాటిన పెద్ద పులి దామరతోగు, రేగళ్ల, అడవిరామారం అడవి మార్గంలోని కిన్నెరసాని అభయారణ్యంలోకి ప్రవేశించవచ్చని భావిస్తున్నారు. ఎక్కడ ఏం జరుగుతుందోనని గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

క్లుప్తంగా

రేపు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం



మంత్రి తుమ్మలకు ఆహ్వానపత్రిక అందిస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మంఅర్బన్: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు 75 ఏళ్ల అపూర్వ సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై గల ఎన్టీఆర్ పార్క్‌లో ఎన్టీర్ సినీ వజ్రోత్సవ వేడుకలు చేస్తున్నట్లు ఆయన అభిమాన సంఘం బాధ్యులు తెలిపారు. గురువారం ఈ వేడుకలకు హాజరుకావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన అంజయ్య, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, ఆళ్ల అంజిరెడ్డి, రావూరి సైదుబాబు, మిక్కిలినేని నరేందర్, కృష్ణమూర్తి, పులిపాటి ప్రసాద్, మందడపు సుధాకర్, కిలారు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెం వాసి.. అమెరికాలో పీహెచ్‌డీ



అమెరికాలో డాక్టరేట్ పొందిన శ్రీనివాస్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీనివాస్ అమెరికాలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. చీకటి వెంకటేశ్వర్లు, శాంతమ్మ కుమారుడు శ్రీనివాస్ అమెరికాలోని టెక్సాస్ స్టేట్ ఆఫ్ రియో గ్రాండ్ వ్యాలీ యూనివర్సిటీలో చదివి అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొలువు సాధించారు. టెక్సాస్ రాష్ట్రంలో 2019 – 2024 మధ్య కాలంలో యూనివర్సిటీ ఆఫ్ కుంబర్ ల్యాండ్స్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమెరికాలో డాక్టరేట్ అందుకున్న శ్రీనివాస్‌ను తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు గురువారం ఫోన్‌లో అభినందించారు.

మిరపతోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిరప తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏన్కూరు: మండల పరిధిలోని భగవాన్‌నాయక్‌తండాలో సాగు చేసిన మిరపతోటలను గురువారం వైరా కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవికుమార్, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పూత పిందె దశలో ఉన్న మిరపకు కొమ్మకుళ్లు తెగులు ఆశించిందన్నారు. ఈనేపథ్యాన తోటకు సూక్ష్మ పోషకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, తద్వారా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మిరపలో ఎండుతెగులు లక్షణాలు, నల్ల తామర పురుగులు, తెల్లదోమ తదితర వాటి నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహారావు, ఏఈఓ లహరి పాల్గొన్నారు.

హోటల్ వ్యాపారి ఐపీ

ఖమ్మం లీగల్ : మధిర మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎం.మనోహర్ రూ.47,97,983కు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. ఫిర్యాదుదారుడు హోటల్, మినరల్ వాటర్ ప్లాంట్ వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు, బంధువుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతోపాటు రుణదాతల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో 14 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కూసుమంచి: మండలంలోని గురువాయిగూడెం గ్రామానికి చెందిన బొజ్జ చినవెంకటరెడ్డి (80) గురువారం తన చేనులో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరెడ్డి గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం చేనుకు వెళ్లి అక్కడ గడ్డిమందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,250	6,250
మిర్చి	16,300	6.000
మిర్చి తాలు	7,400	7,400
ఏసీ మిర్చి	16,700	7,000
ఏసీ తాలు	7,400	6,000
పత్తి	7,200	6,450

– ఖమ్మం వ్యవసాయం

మన చిన్నారులు భద్రమేనా?!

- ఖమ్మం పెద్దాస్పత్రి ఎస్ఎన్‌సీయూలో సౌకర్యాలు కరువు
- అవసరానికి సరిపడా లేని వార్మర్లు
- ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు శూన్యం
- యూపీ ఘటన నేపథ్యాన మొదలైన చర్చ



ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఖమ్మంవైద్యవిభాగం: కొన్నాళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కళాశాలలో ఎస్ఎన్‌సీయూ(నవజాత శిశు సంరక్షణ కేంద్రం)లో షార్ట్ సర్క్యూట్ జరిగి 10 మంది చిన్నారులు సజీవ దహనమైన ఘటన దేశ వ్యాప్తంగా కలచివేచింది. ఈ నేపథ్యాన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నారుల రక్షణపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం చిన్నారుల భద్రత విషయంలో ఆందోళన లేకపోయినా, అనుకోని సంఘటన జరిగితే పరిస్థితిని ఎంత వరకు అదుపులోకి తెస్తారనేది ప్రశ్నగా ఉండిపోయింది.

ఎస్ఎన్‌సీయూకి తాకిడి

నవజాత శిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూపై రోజురోజుకు తాకిడి పెరుగుతోంది. వివిధ అనారోగ్య కారణాలతో పుట్టిన శిశువులను వార్మర్లలో ఉంచి చికిత్సలు అందిస్తే వారి ఆరోగ్యం త్వరగా కుదుటపడుతుంది. శిశువులకు తల్లి గర్భంలో లాగా వెచ్చదనాన్ని అందిస్తూ చికిత్స అందించడానికి వార్మర్లు వినియోగిస్తుంటారు. కానీ జిల్లా కేంద్రంలోని ఎస్ఎన్‌సీయూలో 20 వార్మర్లు మాత్రమే అందుబాటులో ఉండగా.. అందులో కేవలం 16 మాత్రమే పనిచేస్తున్నాయని, ఇవి ఎంతమాత్రం సరిపోవడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. అంతేకాక జిల్లా నలుమూల నుంచి ఇక్కడికే శిశువులను తీసుకొస్తుండడంతో ఎస్ఎన్‌సీయూపై తాకిడి పెరిగి 24 గంటలు వైద్య సేవలు కొనసాగించాల్సి వస్తోంది. ఈ యూనిట్‌లో 14 మంది నర్సింగ్ సిబ్బంది, ముగ్గురు పిల్లల వైద్య నిపుణులు శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పరంగా జిల్లా అంతటికి ఇదే దిక్కు కావడంతో వారిపై పనిభారం పడుతోంది. ఇదే తరుణంలో ఎస్ఎన్‌సీయూలో ఎంత మేర రక్షణ ఏర్పాట్లు ఉన్నాయంటే లేవనే చెప్పాలి. అనుకోని ప్రమాదం సంభవిస్తే ముందుగా పసిగట్టడానికి తగిన ఏర్పాట్లు మాత్రం ఎంతమాత్రం కనిపించట్లేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

యూనిట్ విస్తరిస్తేనే..

ప్రస్తుతం ఉన్న ఎస్ఎన్‌సీయూ యూనిట్ ఎంత మాత్రం సరిపోవట్లేదు. ఇరుకైన ప్రాంతంలో ఉండటంతో భద్రతాపరంగా ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 20 నుంచి 25 ప్రసవాలు నిత్యం జరుగుతుంటాయి. అలాగే వివిధ ఆస్పత్రుల్లో పుట్టిన అనారోగ్య చిన్నారులను కూడా ఇక్కడకే తెస్తుండడంతో సరైన సేవలు అందించడం కష్టతరమవుతోంది. దీంతో కొంత మంది చిన్నారులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న యూనిట్‌ను విస్తరిస్తే కానీ సమస్యకు పరిష్కారం లభించదని వైద్యులు చెబుతున్నారు. దీనికి తోడు వార్మర్లను కూడా సాధ్యమైనన్ని ఎక్కువ తెప్పించాలని సూచిస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని ప్రమాదాలు సంభవించక ముందే యూనిట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.

మూడు విధాలుగా చికిత్స



డిజిగ్నేటెడ్ పీడియాట్రిక్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు మూడు విధాలుగా చికిత్సలు అందిస్తారు. బరువు తక్కువగా పుట్టడం, కామెర్లు, ఇతర అవయవాల ఎదుగుదలలో లోపం, అలాగే పలు అనారోగ్య సమస్యలకు చికిత్సలు అందిస్తుంటారు. నెలలోపు చిన్నారులకు నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచి చికిత్స అందిస్తారు. ఆయా చిన్నారులను వార్మర్లలో ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చిన్న పిల్లల వైద్యులు చికిత్స అందిస్తారు. అలాగే నెల దాటిన చిన్నారులకు డిజిగ్నేటెడ్ పీడియాట్రిక్ కేర్ యూనిట్(డీపీసీయూ)లో, కామెర్లతో బాధపడే నవజాత శిశువును ఫొటోథెరపీ యూనిట్‌లో ఉంచి చికిత్స అందిస్తుంటారు.

భద్రతకు ఇబ్బంది లేదు



ఎస్ఎన్‌సీయూ విషయంలో భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బంది లేదు. ముందస్తు రక్షణ చర్యలు తీసుకున్నాం. అందుబాటులో ఉన్న వార్మర్లతో మెరుగైన చికిత్సలు అందిస్తూ చిన్నారుల ప్రాణాలు కాపాడుతున్నాం. అలాగే డీపీయూసీ యూనిట్‌లోనూ చిన్నారులకు ఉత్తమమైన వైద్య సేవలు అందుతున్నాయి. అయితే మరికొన్ని వార్మర్లు కేటాయిస్తే మరింత మంది చిన్నారులకు సేవలందించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎంసీహెచ్‌లో వైద్య సేవల విషయంలో ఎలాంటి ఢోకా లేదు. ఎస్ఎన్‌సీయూను విస్తరిస్తే మరింత మందికి మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

– డాక్టర్ బాబురత్నాకర్, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానిదే..



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంరూరల్: ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానికి మాత్రమే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ప్రారంభమైందని, శ్రీలంక, నేపాల్, ఫ్రాన్స్ దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయని, గత కొన్నేళ్లుగా మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు కమ్యూనిస్టులు ముందుండి పోరాడుతున్నారని, లగచర్లలో వేల ఎకరాల గిరిజనుల భూమిని ఫార్మా కంపెనీలకు కేటాయించకుండా ఆపిన ఘనత వామపక్షాలదేనన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 5 లక్షల ఎకరాల భూములకు పోడుపట్టాలు ఇవ్వడంలో ప్రధాన పాత్ర కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని. సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో జతకట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పు చేస్తే నిలదీస్తామని తెలిపారు. అనంతరం డివిజన్ కమిటీ కార్యదర్శిగా బండి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు నండ్ర ప్రసాద్, శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్, డి.తిరుపతిరావు, జి.నాగేశ్వరరావు, వి.సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు సౌర విద్యుత్..

ఐటీడీఏ పీఓ రాహుల్



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: పీఎం కుసుమ్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్లను నెలకొల్పడానికి అనువైన గిరిజన పంట పొలాలను గుర్తించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో ఫారెస్ట్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, ఐకేపీ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేస్తుందని తెలిపారు. సబ్ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పోడు భూములను గుర్తించి, ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ఏరియాలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మెగా వాట్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి మహిళలకు 90 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని, 10 శాతం లబ్ధిదారుల వాటా ఉంటుందని వివరించారు. ఈ ప్లాంట్లతో పర్యావరణ పరిరక్షణతోపాటు గిరిజన గ్రామాలకు, పంట పొలాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. అటవీ వివాదాలు ఉన్న పొలాల జోలికి వెళ్లొద్దని, అవసరమైతే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూమిని లీజుకు తీసుకుని ఏర్పాటు చేయాలని చెప్పారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో కొండరెడ్ల గిరిజనులకు పొడర్ పట్టాలు అందడం లేదని దరఖాస్తులు వస్తున్నాయని, 2005 ముందు ఉన్న వారిని గుర్తించి వారికి పొడర్ పట్టాలు అందించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, మహేందర్ రెడ్డి, భాస్కరన్, లక్ష్మీనారాయణ, మునీర్ పాషా, ఫారెస్ట్, వ్యవసాయం, విద్యుత్ శాఖ అధికారులు, ఐకేపీ ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

నూతన మెనూ ప్రదర్శించాలి

గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డైట్, కాస్మొటిక్ చార్జెస్, నూతన మెనూ వివరాలను ప్రదర్శించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక సెక్రెటరీ శరత్ అన్నారు. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం నుంచి అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్ రెడ్డితో కలిసి గురువారం ఆయన ఐటీడీఏ పీఓలు, డీడీ, డీటీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 14న నిర్వహించే ఓరియంటేషన్ ప్రోగ్రాంకు తీసుకోవాల్సిన కార్యాచరణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటగది స్టోర్ రూమ్ శుభ్రంగా ఉండేలా సంబంధిత వార్డెన్లు, హెచ్‌ఎం చూసుకోవాలన్నారు. పాఠశాల ముందు ప్రత్యేకంగా టెంట్లు వేయించి పిల్లల తల్లిదండ్రులకు, అతిథులకు నూతన మెనూ వివరించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ మాట్లాడుతూ ప్రోగ్రాంకు తల్లిదండ్రులకు అందరూ హాజరయ్యేలా చూస్తామని తెలిపారు. సహపంక్తి భోజనం చేసేలా ప్లాన్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయండి

విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

సత్తుపల్లిరూరల్: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం అయన గంగారంలోని దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం తెలంగాణ బయలాజికల్ సైన్స్ ఫోరం నిర్వహిస్తున్న మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయరాజు, మాధవి, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ నిందితుల అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ లక్ష్మీభార్గవి, సిబ్బంది

మధిర: మండలంలోని పలు గ్రామాల్లో కొంతకాలంగా చిల్లర కొట్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న దొంగలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు. గురువారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మధిరలో ఇటీవల కాలంలో చోరీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో కృష్ణాపురం సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఒక ఆటో మధిర నుంచి వైరా వైపు వెళ్తూ పోలీసులను చూసి తిరిగి వెనక్కు వెళ్తుండడంతో అనుమానం వచ్చి ఆటోను వెంబడించి పట్టుకున్నారు. ఆతర్వాత అందులోని ముగ్గురు వ్యక్తులను విచారించగా.. తాము మద్యానికి అలవాటుపడడంతో డబ్బుల కోసం చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యాన ఖమ్మం, మధిరలో మూడు చోరీలు చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి ఆటో, తోక వెంకటేష్ ఇంటివద్ద దాచిపెట్టిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన నల్ల బోతుల రాజేష్, మధిరకు చెందిన యసారపు రవికుమార్, మధిర మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన తోక వెంకటేష్, మధిర పట్టణం హనుమాన్ కాలనీకి చెందిన వేముల వెంకటేష్ ఉన్నారు.

మట్టి టిప్పర్ దహనం



కాలిపోతున్న మట్టి టిప్పర్

సత్తుపల్లిటౌన్: అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్ షార్ట్ సర్క్యూట్‌తో దహనమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని జగన్నాథపురం నుంచి సత్తుపల్లికి అక్రమంగా ఓ టిప్పర్‌లో మట్టి తరలిస్తున్నారు. ఈక్రమంలో కిష్టారం ఓపెన్ కాస్టు వద్దకు రాగానే ఇంజన్‌లో నుంచి అకస్మాత్తుగా పొగలు వ్యాపించడంతో డ్రైవర్ జాతీయ రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ ఇంజన్ పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నిందితుల విచారణ!

నేలకొండపల్లి : నేలకొండపల్లిలో గత నెల 27 జరిగిన దంపతుల హత్యకు సంబంధించిన నిందితులను గురువారం రాత్రి విచారణ చేపట్టారు. హత్యకేసులో ప్రధానమైన వారిగా భావిస్తున్న నలుగురు నిందితులను మండలంలోని పైనంపల్లి గ్రామ శివారులో ఉన్న టోల్‌గేట్ వద్ద విచారించి వివరాలు సేకరించారు. దంపతులను హత్య చేసిన తీరును సాక్షుల సమక్షంలో చెప్పించారు. ఇందుకు సంబంధించి పైనంపల్లి గ్రామానికి చెందిన కొందరు గ్రామ పెద్దలతో పాటు, పంచాయతీ కార్యదర్శిని కూడా పంచనామాకు పిలిపించారు. విచారణ జరుగుతున్న సమయంలో ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ పోలీసులు భారీగా టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. కొందరు మఫ్టీలో ఉన్నారు. కాగా విచారణకు సంబంధించి వివరాలు కోరినప్పటికీ పోలీసులు నిరాకరించారు. శుక్రవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం.

భూ వివాదంలో ఘర్షణ..

పలువురికి తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో గురువారం ఇరు వర్గాల మధ్య జరిగిన భూవివాదంలో ఘర్షణ చోటుచేసుకోగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనగ రాములు, కందుల శ్రీరాములు కుటుంబాల మధ్య గురువారం భూ వివాదం చోటుచేసుకుంది. ఈనేపథ్యాన ఇరువర్గాల వారు గొడ్డళ్లు, కర్రలు, రాళ్లతో ఘర్షణకు పాల్పడ్డారు. ఈక్రమంలో ఇరు వర్గాలకు చెందిన తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కాగా వారికి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. బాధితులైన శనగ వీరబాబు, శనగ శ్రీను, కందుల రాజా పరస్పర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

చిరస్మరణీయుడు 'చేకూరి'



సత్యంబాబు(ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): చిరు వ్యాపారంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ.. తన తోటి వారికి సహాయ సహకారాలు అందించిన మహోన్నత వ్యక్తి చేకూరి సత్యంబాబు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. వ్యాపారవేత్త చేకూరి సత్యంబాబు సంస్మరణ సభ గురువారం నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రముఖులు తరలివచ్చి సత్యంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరికో ఉపాధి కల్పించిన వ్యక్తి సత్యంబాబు అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోదరుడు నామ కృష్ణయ్య, గుమ్మడి నర్సయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావుతో పాటు రవిమారుత్, సుబ్బారావు, సత్యనారాయణ, నరేందర్, వీరభద్రం, సైదుబాబు, సౌజన్య, రవీంద్రనాథ్, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, సత్యంబాబు భార్య చేకూరి నాగేంద్రమ్మ, కుమారుడు, కోడలు శ్రీధర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డ్ స్థాయిలో విద్యుదుత్పత్తి

కేటీపీఎస్ 6వ దశలో నిర్విరామంగా 100 రోజులు పూర్తి



సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలోని 6వ దశలో విద్యుత్ ఉత్పత్తి రికార్డ్ స్థాయిలో నడుస్తోంది. 500 మెగావాట్ల సామర్థ్యం గల 11వ యూనిట్‌లో విజయవంతంగా ఉత్పత్తి అందిస్తూ గురువారం నాటికి 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఈ ఎం.ప్రభాకర్ రావును కలిసి మొక్క అందించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఈ మాట్లాడుతూ ఇంజనీర్లు, ఉద్యోగ, కార్మికుల సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో మెరుగైన ఉత్పత్తి దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి డి.ఉమా మహేశ్వరరావు, ట్రెజరర్ చంద్ర కళాధర్, ఎం.శ్రీనివాసరావు, రాజబాబు, పావని, శ్రీలక్ష్మి, మధుసూదన్ పాల్గొన్నారు.

11 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో గురువారం 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మేరకు సుకుమా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ కిరణ్ జి.చవాన్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయే మావోయిస్టులకు కల్పిస్తున్న పునరావాసం గురించి సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ అమిత్ ప్రకాశ్, డిప్యూటీ కమాండెంట్ గన్వీర్‌లు సుకుమా జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 11 మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు రాగా వారిని జిల్లా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి సాయం అందించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఏన్కూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గార్లఒడ్డు సమీపాన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ క్రషర్ మిల్లు వద్ద ఏపీ 29యూ 6179 అనే లారీలో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. ఈనేపథ్యాన ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకోగా 63.70 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. లారీని ఏన్కూరు పోలీసులకు అప్పగించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ పల్టీ.. రైతు మృతి



కృష్టారావు (ఫైల్)

ముదిగొండ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ పల్టీకొట్టి ఓ రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బాణాపురానికి చెందిన కొత్త కృష్టారావు(43) అనే రైతు ట్రాక్టర్ ఇంజన్‌తో చల్లసముద్రం చెరువు సమీపంలోని మిరప తోటలో ఉన్న ట్రాలీని తీసుకొచ్చేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో చెరువుకట్టపై వెళ్తుండగా.. ట్రాక్టర్ ఇంజన్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టడంతో కృష్టారావు తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. స్థానికులు గమనించి రైతును బయటకు తీసుకురాగా అప్పటికైనా మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కూతుళ్లు ప్రేమ పెళ్లిచేసుకున్నారని..

- పురుగుల మందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి

ఖమ్మంక్రైం: కూతుళ్లు ప్రేమ పెళ్లి చేసుకున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీటౌన్ ఎస్ఐ కోటా నాగేంద్రారావు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం జూపేడకు చెందిన దరబోయిన మల్సూరు(45)కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరు ఖమ్మంలోని శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటుండగా.. గతంలో పెద్దకూతురు, ఇటీవల చిన్న కుమార్తె కూడా ప్రేమ వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 3న నగరంలోని అయ్యప్ప దేవాలయ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.